మాంసం అంతా మోసం!

- జోరుగా నాణ్యత లేని మాంసం విక్రయాలు
- కల్తీమాంసం అంటగడుతూ తూకాల్లోనూ మోసగిస్తున్న వైనం
- పశువైద్యాధికారుల ధ్రువీకరణ లేకుండా జీవాల వధ
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం



రామభద్రపురం:

ముక్క లేనిదే ముద్ద తినని మాంసంప్రియుల సంఖ్య భారీగానే ఉంది. ఆదివారం, మంగళవారం వస్తే చాలు మాంసం వినియోగం గణనీయంగా ఉంటుంది. అయితే తాము కొనుగోలు చేస్తున్న మాంసం నాణ్యమైనదా కాదా అని గుర్తించలేని వారు చాలా ఎక్కువ మంది ఉన్నారు. తాము కొనుగోలు చేసేది పొట్టేలు మాంసమా కాదా అని గుర్తించలేని పరిస్థితి కూడా ఉంది. అలాంటి వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు నింబంధనలు బేఖాతరు చేస్తూ కనీస ప్రమాణాలు పాటించకుండా నాణ్యత లేని మాంసాన్ని అంటగడుతున్నారు.

అనుమతి లేకుండా దుకాణాలు..

బొబ్బిలి నియోజకవర్గంలో పంచాయతీ, లైసెన్స్ పొందిన మాంసం దుకాణాలు చాలా అరుదు. ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మాంసం దుకాణాలు కోకొల్లలు. షాపుల్లో సాధారణ రోజుల్లో 2 క్వింటాళ్ల నుంచి 3 క్వింటాళ్ల వరకు మాంసం విక్రయిస్తారు. అదే ఆది, మంగళవారాల్లో అయితే దాదాపు 10 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల వరకు విక్రయిస్తారు. కిలో పొట్టేలు మాంసం రూ.1000ల వరకు అమ్ముతున్నారు.

ముద్ర వేశాకే అమ్మాలి..

నిబంధనల ప్రకారం పశువైద్యాధికారుల పరిశీలన చేసి, వారు ఆరోగ్యకరమైన పొట్టేలు అని ధ్రువీకరించిన తర్వాతే వ్యాపారులు పొట్టేలు కోసి అమ్మాలి. శుభ్రం చేసిన తర్వాత కూడా వైద్యులు మరోసారి మాంసాన్ని పరీక్షించి మాంసం సురక్షితమైందని ముద్ర వేసిన తర్వాతే దుకాణాల్లో పెట్టి, విక్రయాలు జరపాలి. మాంసం విక్రయాలకు ఉంచినప్పుడు దుమ్ము, ధూళి, ఈగలు, దోమలు వాలకుండా వాటిపై తెర కప్పి ఉంచాల్సి ఉంది. అయితే నియోజకవర్గంలోని బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం, బాడంగి మండలాల్లో ఈ ప్రక్రియ కొనసాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కబేళాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు.. పశువైద్యాధికారుల నిర్ధారణ చేసిన తర్వాతనే జీవాలను కోయాలి. అలా కాకుండా అధికారుల నిర్ధారణ జరగకుండా బహిరంగ ప్రాంతాల్లో జీవాలను కోసి, మాంసం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. కొందరు వ్యాపారులు పొట్టేళ్లకు బదులుగా గొర్రెలు, మేకలు కోసి పొట్టేళ్ల మాంసం అని విక్రయిస్తూ కల్తీ మాంసాన్ని మాంసం ప్రియులకు అంటగడుతున్నారు. తూకాల్లో సైతం మోసా లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా చౌక ధరకు హోటళ్లు, దాబాలకు సరఫరా చేస్తున్నారు.



ఐస్‌బాక్సుల్లో మాంసం నిల్వలు..

ఒక్కోసారి కొందరు వ్యాపారులు అయితే ముందు రోజు అమ్మకాల్లో మిగిలిన మిగిలిన మాంసాన్ని మరుసటి రోజు అమ్మేందుకు ఐస్‌బాక్సుల్లో నిల్వ ఉంచి, అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇదిలా ఉంటే పశువైద్యాధికారులు పొట్టేళ్ల పరిశీలించి, ఆ పొట్టేలు ఆరోగ్యమైనదా కాదా అని నిర్ధారించేందుకు నెలనెలా పశువైద్యశాఖకు సర్‌చార్జ్ చెల్లించాలి. అయితే ఎలాంటి సర్‌చార్జీలు చెల్లించకపోవడంతో పశువైద్యులు పొట్టేళ్ల నిర్ధారణకు వెళ్లడం లేదని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

తాజా మాంసాన్ని ఇలా గుర్తించాలి..

పొట్టేలు మాంసం తాజాదైతే లేత తెలుపు, లేత పింకు రంగులో ఉంటుంది. కల్తీ, నిల్వ ఉంచిన, లేదా చెడిపోయిన మాంసం అయితే ముదురు ఎరుపు రంగులో ఉంటుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఆ మేరకు మాంసం ప్రియులు కొనుగోలు చేయాలని వారు సూచిస్తున్నారు.

వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం..



మాంసం వ్యాపారులు తొలుత లైసెన్స్‌లు తీసుకుని నింబంధనల మేర వ్యాపారం చేయాలి. ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకొని కల్తీ లేని పొట్టేళ్ల మాంసం విక్రయించాలి. దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలి. షాపుల ముంగిట ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ క్రమం తప్పకుండా చల్లాలి. ప్లాస్టిక్ కవర్లు వినియోగించకూడదు. పరిశుభ్రత పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాసరావు, ఈవో, రామభద్రపురం మేజర్‌పంచాయతీ

కచ్చితంగా నిబంధనలు పాటించాలి..



మాంసం వ్యాపారులు కచ్చితంగా నింబంధనలు పాటించాలి. పశువైద్యాధికారుల పర్యవేక్షణలోనే పొట్టేళ్లు కోయాలి. వారు ధ్రువీకరించిన మాంసాన్నే విక్రయించాల్సి ఉంటుంది. ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకొని కల్తీ లేని మాంసం అందించాలి. నింబంధనలు పాటించని వారిని గుర్తించి, చర్యలు తీసుకుంటాం.

–ఎల్ విష్ణు, పశుసంవర్థక శాఖ ఏడీ, బొబ్బిలి

కానరాని పరిశుభ్రత..

జీవాలు వధించే ప్రాంతం.. పరిశుభ్రంగా ఉండడమే కాకుండా బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు చేస్తుండడంతో దుమ్మూధూళిలో మాంసం విక్రయిస్తున్నారు. దీనిని వినియోగించే వారంతా అనారోగ్యం బారిన పడుతున్నారు. మాంసం కోసేందుకు ఉపయోగించే కత్తులు, చాకులు ఇతర పాత్రలు కూడా రోజూ వేడినీటితో కడగాల్సి ఉంది. నిత్యం శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు డిస్ ఇన్ ఫెక్ట్ చేయాలన్న నిబంధన కూడా ఉంది. దుకాణాల ప్రాంగణంలో ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ క్రమం తప్పకుండా చల్లాలి. వ్యాపారులకు కూడా చర్మవ్యాధులు ఉండకూడదు. గోర్లు పెంచుకోకూడదు. మాంసం విక్రయాలకు సంబంధించి పశువైద్యులు, పంచాయతీ, మున్సిపల్ అధికారులే ఇవన్నీ పరిశీలించాలి. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే మోసం జరుగుతోందని అందరూ అంటుండడం గమనార్హం.



రామభద్రపురంలో పశువైద్యాధికారుల ధ్రువీకరణ లేకుండా మాంసం విక్రయాలు

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ట్రాక్టర్

వంగర: మండల పరిధి నీలయ్యవలస సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడింది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో పొలాల వైపు పడిపోయింది. దీంతో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి కిందకు దూకడంతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మినీగోకులాల నిర్మాణం పరిశీలన



మినీగోకులం నిర్మాణం పరిశీలిస్తున్న ఏపీవో సాయిరాం

రాజాం: మండలంలోని శ్యాంపురం, ఒమ్మి తదితర గ్రామాల్లో మినీ గోకులాల నిర్మాణాలను ఉపాధి ఏపీవో సాయిరాం ఆదివారం పరిశీలించారు. పలుచోట్ల పిల్లర్ల ఏర్పాటుతో పాటు కొలతలపై ఆరాతీశారు. నిబంధనల మేర నిర్మించిన గోకులాలకు మాత్రమే బిల్లుల చెల్లింపు ఉంటుందని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ఆరాధన



క్రీస్తు సందేశం చదివి వినిపిస్తున్న ఫాదర్

బాడంగి: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని ఆర్‌సీఎం, సీబీఎం చర్చిల్లో క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా చర్చిల్లో ప్రార్థనల్లో పాల్గొన్న మతవిశ్వాసకులకు క్రీస్తు సందేశాన్ని మతబోధకులు వినిపించారు. దయామయుడు, కరుణామయుడు యేసుప్రభువు అని, ఆయన చూపిన శాంతి, కరుణ, దయ, జాలి, త్యాగం మార్గాలను అనుసరించాలని తెలిపారు.

వాహన తనిఖీలు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలావతి

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ పి.నీలావతి సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన ధ్రువపత్రాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: పట్టణంలోని కోట వద్ద యూటీఎఫ్ తరపున రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయ గౌరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన పాల్గొని, క్యాలెండర్ విడుదల చేసి, అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధుసూదనరావు, జిల్లా నాయకులు సత్యనారాయణ, శశిభూషణరావు, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

సోలార్ లైట్ల ఏర్పాటు



అరసబలగలో సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని అరసబలగ గ్రామంలో ఆదివారం సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. విజయనగరం ఎంపీ నిధుల నుంచి మంజూరైన ఈ లైట్లను సర్పంచ్ కొరగంజి సాయిరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి సోలార్ లైట్లు మంజూరు చేయాలని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కెకె రంగారావు(బేబీనాయన) దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఎంపీతో మాట్లాడి సోలార్ లైట్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. గ్రామానికి సోలార్ లైట్లు వేయడంలో కృషి చేసిన బొబ్బిలి ఎమ్మెల్యేకి, లైట్లు మంజూరు చేసిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

డిఫెన్స్ ఉద్యోగాలకు క్రమశిక్షణే ప్రధానం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: డిఫెన్స్ ఉద్యోగాల్లో చేరాలనుకునే వారికి క్రమశిక్షణ ప్రధానంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పట్టణంలోని గాయత్రీ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. విద్యార్థులు, యువత అంతా వ్యక్తిత్వ వికాసం పొందాలన్నారు. క్రమశిక్షణతో కూడిన చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా, కళాశాలలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 65 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పోల లక్ష్మీదేవి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చుక్క రమణ, అధ్యాపకులు సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అప్పలరాజును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: మండలంలోని సోపేరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత యడ్ల అప్పలరాజును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల అప్పలరాజు భార్య రమణమ్మ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేరి, చికిత్స అనంతరం ప్రస్తుతం ఇంటి వద్ద కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజేష్.. ఆ గ్రామానికి చేరుకుని రమణమ్మను పరామర్శించడంతో ఆరోగ్యం ఎలా ఉందన్న విషయం అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ అధ్యక్షుడు రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, సర్పంచ్‌లు వంజరాపు విజయ్‌కుమార్, నక్క శ్రీను, దామెర శ్రీనివాసరావు, బుక్కా జగదీష్, యడ్ల గంగాదర్, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం అందకే రైతు ఆత్మహత్యలు



వేమిరెడ్డి లక్ష్మునాయుడు

బొబ్బిలి: ప్రభుత్వం సాయం చేయకపోవడంతోనే రైతు ఆత్మహత్య ఘటనలు చోటు చేసుకుంటున్నాయని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టిలతో రైతులు పంటలు నష్టపోతున్నా ప్రభుత్వం నుంచి ఆదరణ లేదన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు రైతు భరోసా పథకం పేరిట సాగుకు పెట్టుబడి సాయం అందివ్వ డంతో పాటు పంటలకు ఉచిత బీమా ప్రీమియం చెల్లించిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఇస్తానన్న రూ.20 వేల సాయం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. అలాగే పంటల బీమా ప్రీమియం కూడా రైతులే చెల్లించాలని చెబుతుండడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సాయం చేస్తే సాగు సులువవుతుందన్నారు.

వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న చిన్నశ్రీను సోల్జర్స్ ట్రస్టు అధ్యక్షురాలు సిరిసహస్ర

బాడంగి: మండలంలోని హరిజనపాల్తేరు గ్రామంలోని నిరుపేదలు, వృద్ధులకు చిన్నశ్రీను సోల్జర్స్ ట్రస్టు అధ్యక్షురాలు సిరిసహస్ర.. ఆదివారం వస్త్రదానం చేశారు. క్రిస్మస్, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజుల సందర్భంగా ట్రస్టు తరపున నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా చీరలు, దుప్పట్లు అందించినట్లు ఆమె తెలిపారు. అయా రోజుల్లో తుపాను వర్షాలు పడుతున్నందున చీరలు, దుప్పట్ల పంపిణీ చేయలేకపోయామన్నారు. అంతకుముందు సిరిసహస్రకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె అక్కడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగజ్జీవన్‌రావ్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ బి.రమేష్, జేసీఎస్ కన్వీనర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, పుస్తక పఠనం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో పుస్తకాలు ఏవిధంగా చదవాలో నేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రతిరోజూ పుస్తకాలు చదవాలని, అలా చేయడం ద్వారా మంచి జ్ఞానం పొందవచ్చన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కూడా విద్యార్థులు తర్ఫీదు పొందాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులు చేరాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రాజాం: పరిసరాల పరిశుభ్రత పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. స్థానిక పట్టణంలోని వాసవీనగర్, గాయత్రీకాలనీ, మెంతిపేట, అమ్మవారికాలనీ, ఎస్సీకాలనీ, సారధి తదితర ప్రాంతాల్లో ఆదివారం పర్యటించిన ఆయన.. ఇంటి ముంగిట అనవసర నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయవద్దని తెలిపారు.

శ్మశానవాటికకు రోడ్డు నిర్మించండి

రేగిడి: శ్మశానవాటికకు వెళ్లేందుకు వీలుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని మండలంలోని బూరాడ గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామంటున్నారు. కళ్లాలు, పొలాల మీదుగా ఇరుకై న దారిలో మృతదేహాలను మోసుకుని వెళ్లాల్సి వస్తోందని, వర్షాకాలంలో రోడ్డు బురదమయమై పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. ఇప్పటికై నా రోడ్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి

రామభద్రపురం: యువత అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే బేబీనాయన ఆకాంక్షించారు. మండల కేంద్రంలో శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన యూత్.. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోడూరు షణ్ముఖ్ పేరిట ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన బరిలో నిలిచే పార్వతీపురం, రామభద్రపురం, బొబ్బిలి జట్ల సభ్యులను కరచాలనం చేసి, పరిచయం చేసుకున్నారు. ఆ తర్వాత టాస్ వేసి, పోటీల ఆరంభానికి శ్రీకారం చుట్టారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ విద్య, వ్యవసాయం, పారిశ్రామిక, సామాజిక రంగాల్లో కూడా యువత రాణించి, మంచి గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వి.ప్రసాదరావు, సర్పంచ్ ఆర్. ఈశ్వరరావు, ఉప సర్పంచ్ సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త పడాల ప్రసాదరావు సూచించారు. మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు సేవా కార్యక్రమాలు, వాటి ఫలితాలు, నామ సంకీర్తన, నగర సంకీర్తన వంటివి వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ప్రశాంతి సేవా ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, భజన మండలి కన్వీనర్ లావేటి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కచ్చితంగా సెలవులు అమలు చేయాలి

రాజాం సిటీ: కార్పొరేట్ పాఠశాలల్లో సెలవులు కచ్చితంగా అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ సూచించారు. స్థానిక పట్టణంలోని చైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో ఆదివారం తరగతులు నిర్వహించడాన్ని ఆయన అడ్డుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై చదువు ఒత్తిడి పడకుండా చూడాలని, సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణ సరికాదన్నారు. నిబంధనలు వ్యతిరేకిస్తూ ఎక్కడైనా తరగతులు నిర్వహిస్తే యాజమాన్యాలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని లేకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు.

వ్యర్థాలు ఇలా.. నీరు వెళ్లేదెలా?

రాజాం: పట్టణంలోని పలు వార్డుల్లో మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ప్రజలంతా ప్లాస్టిక్ బాటిళ్లు, కప్పులు, సంచులు, వస్తుసామగ్రిని వినియోగించి న అనంతరం కాలువల్లో పడే స్తున్నారు. అవి పలు చోట్ల కాలువల్లో విపరీతంగా పేరుకుపోయి మురుగునీరు వెళ్లలేని దుస్థితి. ఫలితంగా రోడ్ల మీదకు మురుగునీరు వచ్చి చేర్తుతోంది. అధికారులు స్పందించి, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మల్లిఖార్జునకాలనీలో మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

పల్లెకు పండగొచ్చింది..



పల్లెకు పండగ కళ వచ్చేసింది.. గ్రామ వీధుల్లో హరిదాసు సందడి మొదలైంది. వేకువజామున ఇంటి ముంగిట హరిదాసు కీర్తనలు వినిపిస్తున్నాయి. పిల్లలంతా కేరింతలు కొడుతూ ఆయన వెంట తిరుగుతున్నారు. ఏటా జనవరిలో చేసుకునే సంక్రాంతి పండగ సమయంలో మనకు ఇటువంటి వాతావరణం సహజంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇదే అలికిడి పలు గ్రామాల్లోతారసపడుతుండడంతో పండగ వచ్చేసినట్లేనని అంతా అనుకుంటుండడం గమనార్హం.

–రామభద్రపురం

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అదనపు బోధనా తరగతులు నిర్వహిస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు బొబ్బిలి మండలంలోని నారసింహునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదివారం తరగతులు నిర్వహించారు. గణిత ఉపాధ్యాయుడు ఎన్.రమేష్.. విద్యార్థులకు లెక్కలు బోధించడాన్ని ఎంఈవో పరిశీలించి, పలు సూచనలు చేశారు. సెలవు రోజుల్లోనూ విద్యార్థులకు తరగతులు కొనసాగించాలని తెలిపారు.

–బొబ్బిలిరూరల్

దశాబ్దాలుగా భూ సమస్య తొలగడం లేదు..



కొన్ని దశాబ్దాల కాలంగా తమ భూ సమస్య తొలగడం లేదని కలువరాయి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై బొబ్బిలి మండలంలోని కలువరాయి గ్రామంలో ఆదివారం జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరైన అధికారులను సంప్రదించి, తమ భూ సమస్యను తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా పండిస్తున్న పంటపొలాలకు సంబంధించి, పాసుపుస్తకాలు కుటుంబ సభ్యుల్లో ఇతరుల పేరుతో ఉన్నాయని, భూ విస్తీర్ణంలోని తేడాల కారణంగా బ్యాంకుల్లో రుణాలు కూడా పొందలేకపోతున్నామని వాపోయారు. ఈ సమస్యపై పలుమార్లు అర్జీలు సమర్పించినా అధికారులు పరిష్కరించడం లేదన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయగా, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తహసీల్దారు మల్లపు శ్రీను హామీ ఇచ్చారు.

–బొబ్బిలిరూరల్